నవతెలంగాణ

మెదక్

1

గురువారం | 16 మే 2024 | www.navatelangana.com

బీఆర్ఎస్ హయాంలోనే దేవాలయాల అభివృద్ధి

నవతెలంగాణ- గజ్వేల్



గత ప్రభుత్వంలో దేవాలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని నాచారం టెంపుల్ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం అమ్మదిపూర్ గ్రామంలో నిర్వహించే ముదిరాజ్ సంఘం పెద్దమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తానని ఆయన తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు పెద్దపీట వేసినట్టు ఆయన గుర్తు చేశారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాన్ని కేసీఆర్ ప్రోత్సహించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ముదిరాజ్ సంఘం నాయకులు బోయిని సత్యం, బిక్షపతి, రాములు, రవి, శేఖర్, రామచంద్రం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ అసోషియేషన్ నూతన అధ్యక్షుడి ఎన్నిక

నవతెలంగాణ-బెజ్జంకి



మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ట్రాక్టర్ అసోషియేషన్ నూతన అధ్యక్షుడిగా మాజీ ఆలయ అభివృద్ధి చైర్మన్ బండారీ రాములు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అసోషయేషన్ సభ్యులు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను శాలువ కప్పి సన్మానించారు.

సీఎం మాటతో 'అమ్మ హస్తం'పై ఆశలు



- రేషన్ షాపుల్లో నిత్యవసరాల సరఫరా
- ఉమ్మడి రాష్ట్రంలో అమ్మ హస్తం పథకం అమలు
- కార్డుదారులకు 9 రకాల నిత్యవసర వస్తువుల పంపిణీ
- మళ్లీ ఆ పథకం అమల్లోకి తెచ్చే యోచన
- రైతులు పండించే పంటలకు డిమాండ్

నవతెలంగాణ-మెదక ప్రాంతీయ ప్రతినిధి

"రేషన్ షాపుల్లో ఎక్కువ వస్తువుల్ని తక్కువ ధరకు సరఫరా చేస్తాం" అంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ప్రకటించిన విషయం విధితమే. సీఎం చెప్పిన మాటలతో 'అమ్మ హస్తం' పథకాన్ని మళ్లీ అమలు చేస్తారా..? అనే ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఇందిరాగాంధీ అమ్మ హస్తం పేరుతో 9 రకాల నిత్యవసర వస్తువుల్ని రేషన్ షాపుల్లో తెల్లరేషన్‌కార్డుదారులకు సరఫరా చేశారు. అదే తరహాలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా రేషన్ షాపుల్లో నిత్యవసరాల్ని పంపిణీ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పెరుగుతున్న నిత్యవసరాల ధరల ప్రభావంతో సామాన్యులే కాదు మధ్య తరగతి ప్రజలు సైతం ఉప్పు, పప్పు, బియ్యం, నూనెలు కొనలేని పరిస్థితులున్నాయి. ప్రభుత్వం తక్కువ ధరలకే ఎక్కుత వస్తువుల్ని సరఫరా చేయడం ద్వారా తెల్లరేషన్ కార్డుదారులకు ఎంతో ఉపసమనం కల్గుతుంది. అదే విధంగా రైతులు పండించే పంటలకు సైతం మంచి ధరలు లబిస్తాయని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి.

అమ్మ హస్తం పథకం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రేషన్ షాపుల్లో అమ్మ హస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. రూ.185 రూపాయలకే 9 రకాల నిత్యవసర వస్తువుల్ని నిశిత పరిమాణంలో సరఫరా చేశారు. అట్టి పథకాన్ని ఇందిరాగాంధీ 'అమ్మహస్తం' పేరుతో కొనసాగించారు. తెల్లరేషన్ కార్డులున్న పేదలందరికీ ప్రతి నెలా నిర్దేశించిన 9 రకాల నిత్యవసరాల్ని సరఫరా చేశారు. రూ.1 కిలో చొప్పున ఒక యూనిట్‌కు 4 కిలోల బియ్యంతో పాటు 9 రకాల నిత్యవసరాల్ని కూడా ఇచ్చారు. కిలో చక్కర, 100 గ్రాముల పసుపు, పావుకిలో కారం, కిలో గోదుమలు, కిలో గోదుమ పిండి, కిలో కందిపప్పు, కిలో ఉప్పు, కిలో ఫామాయిల్, అరకిలో చింతపండు చొప్పున ప్యాక్ చేసిన సంచిని రేషన్ షాపుల ద్వారా సరఫరా చేశారు. ఇది అప్పట్లో పేదలకు ఎంతో ఉపయోగపడింది.

తక్కువ ధరకు ఎక్కువ సరుకులు

సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా తెల్లరేషన్ కార్డుదారులకు తక్కువ ధరకే ఎక్కువ నిత్యవసరాల్ని సరఫరా చేయాలనే యోచన చేస్తుంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన ప్రాయమైన ప్రకటన కూడా చేశారు. రాష్ట్రంలో తెల్లరేషన్‌కార్డుదారులకు ఒక యూనిట్‌కు 6 కిలోల బియ్యం సరఫరా చేస్తున్నారు. కరోనా కాలం నుంచి కేంద్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ఇచ్చే బియ్యాన్ని ఉచితంగానే పంపిణీ చేస్తుంది. గతంలో బియ్యంతో పాటు గ్యాస్ నూనె, ఫామాయిల్, చక్కర, పండగల సీజన్‌లో గోదుమలు కూడా సరఫరా చేసేది. 2014 తర్వాత రాష్ట్రంలో రేషన్ దుఖాణాల ద్వారా తెల్లరేషన్ కార్డుదారులకు కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. గ్యాస్‌నూనెపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సబ్సిడీని ఎత్తివేయడంతో రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్‌నూనె సరఫరాను నిలిపేసింది. చక్కరను కూడా కేంద్ర ప్రభుత్వం ఎత్తేసింది. రాష్ట్రంలో ఉన్న సామాజిక, ఆర్థిక వెనకబాటు పరిస్థితుల దృష్ట్యా పేదలకు తక్కువ ధరకే నిత్యవసరాల్ని సరఫరా చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. గతంలో మాదిరి అమ్మహస్తం పథకం కింద ఇచ్చిన సరుల్ని ఇస్తారా..? లేక కొన్నింటిని తీసేసి మరికొన్ని సరుకుల్ని చేరుస్తారా..? అనేది ప్రభుత్వం తీసుకునే నిర్ణయం బట్టి ఉంటుంది.

ధరల పెరుగుదలతో నిత్యవసరాలకు పేదలు దూరం

కేంద్రంలోని బీజేపీ పదేళ్ల పాలనలో నిత్యవసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. ధరల నియంత్రణ చట్టాన్ని కేంద్రం ఎత్తేయడంతో వ్యాపార శక్తులు తమ లాభాల కోసం ధరల్ని పెంచేస్తున్నాయి. బ్యాక్‌మార్కెట్ సృష్టించి అధిక ధరలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా సన్న రకం బియ్యం కిలో ధర రూ.60 ఉంది. కంది, ఇతర పప్పుల ధరలు రూ. 150కి చేరింది. నూనె, చింతపండు, మిర్చి, గోదుమలు, చక్కర వంటి వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. మరో పక్క పేద, దిగువ మధ్య తరగతి ప్రజల ఆదాయాలు తగ్గాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లేకపోవడంతో ఆదాయం తగ్గి కొనుగోలు శక్తి పడిపోయింది. దీంతో పేదలు మూడు పూట తిండికి సైతం నోచుకోని దుస్థితి నెలకొంది. తెల్లరేషన్ కార్డులపై ప్రజలకు అవసరమైన నిత్యవసరాల్ని సరఫరా చేయడం ద్వారా లక్షలాది మంది పేదలకు మేలు జరుగుద్ది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 9 లక్షల వరకు రేషన్‌కార్డులున్నాయి. మరో పక్క రైతులు పండించే పంటల్ని ప్రభుత్వం సేకరించి నిత్యవసరాలు మార్చి తక్కువ ధరకు ప్రజలకు సరఫరా చేయడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కూడా లబించే అవకాశముంది.

బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల దాడి ఎంపీపీకి సంబంధం లేదు

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్ ఇరు వర్గాల దాడి విషయంలో ఎంపీపీ పాండుగౌడ్‌కు సంబంధం లేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి అన్నారు. ఆయన 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ బిజెపి నాయకులు రాజకీయంగా ఎదగడానికి చేస్తున్న కుట్ర అని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల తొపులాటను బీజేపీ నాయకులు రాజకీయం చేయోద్దని హితవు పలికారు. గ్రామంలో ఇరువర్గాల మధ్య వైరం పెంచోద్దని హితవు పలికారు

రైతు పండించిన ప్రతి వరి పంటకు బోనస్ అందించాలి

మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-మద్దూరు



రైతులు పండించిన ప్రతి వరి పంటకు బోనస్ అందించాలని. మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులు సన్న వడ్లు పండిస్తేనే బోనస్ అందిస్తామని. చెప్పడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందుకు రైతులు పండించిన ప్రతి వరి పంటకు క్వింటాలకు రూ.500ల బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులు పండించిన ప్రతి వరి పంటకు ప్రభుత్వం వెంటనే రూ.500ల బోనస్ క్వింటాలకు ఇస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ప్రజా సంక్షేమం పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్

నవతెలంగాణ-మద్దూరు



కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమంపై పట్టింపు లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా పేద ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిందన్నారు. రైతులకు రైతు బీమా. రైతు బంధు. ఇవ్వడంలేదని, అదేవిధంగా కళ్యాణ లక్ష్మి కింద లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సమస్యల పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే మండల జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు ఖాయం

కాంగ్రెస్ జిల్లా నాయకులు మారేళ్ల భాస్కర్ రెడ్డి

నవతెలంగాణ-మద్దూరు



భువనగిరి పార్లమెంటు ఎంపీగా చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు ఖాయమని. కాంగ్రెస్ జిల్లా నాయకులు మారెళ్ళ భాస్కర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజాపాలనతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే భువనగిరి ఎంపీగా చామల కిరణ్ కుమార్ రెడ్డిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. భువనగిరి నియోజకవర్గ ఇంచార్జ్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జనగామ డిసిసి అధ్యక్షుడు నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, సహకారంతో చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎంపీగా గెలుపొందడం ఖాయమని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేస్తుందని. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఎంపీ బండి సంజయ్‌కు అత్మీయ సన్మానం

నవతెలంగాణ-బెజ్జంకి



బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌ను మార్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి అత్మీయ సన్మానం చేసినట్టు బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి బుధవారం తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి బోయినిపల్లి అనిల్ కుమార్, ముష్కె మహేందర్, బీజేవైఎం మండలాధ్యక్షులు తూముల రమేష్,రావుల రాజిరెడ్డి, అన్నాడి మజీద్ రెడ్డి తదితరులతో కలిసి కరీంనగర్ పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్‌కు కలిసి సన్మానించామని మహిపాల్ రెడ్డి తెలిపారు.

మండలంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని గ్రామాలలో బుధవారం రాత్రి దాదాపు 8 గంటల సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. వడ్ల కొనుగోలు కేంద్రాలలో మొన్నటి వర్షానికి తడిసిన వడ్లు ఇటు ఎండినాయెూ లేదో మళ్లీ వర్షం పడడంతో వడ్లు తడుస్తున్నాయి. అన్నదాతకు అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ వర్షం చెరుకు పంటలకు ఎంతో మేలు చేకూరుస్తున్నప్పటికీ వడ్ల కొనుగోలు కేంద్రాలలో మాత్రం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ధాన్యం కొనుగోలులో ఆలస్యం

- 3.50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం... 1.77 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు
- సేకరణలో వేగం పెంచాలంటున్న రైతులు



నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లావ్యాప్తంగా రైతులు పండించిన యాసంగి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అధికారులు చర్యలు చేపట్టినప్పటికీ, ధాన్యం సేకరణ మాత్రం ఆలస్యం జరుగుతుందని చెప్పవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుంచి రాష్ట్రమంతటా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించడంతో జిల్లా అధికారులు అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కానీ కొనుగోలులో మాత్రం ఆలస్యం జరుగుతున్నందున అనుకున్న లక్ష్యానికి అనుగుణంగా కొనుగోలు జరుగుతాయో లేదో అనే అనుమానం వస్తుంది. జిల్లాలో 418 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ఇప్పటివరకు 1,77,295.800 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని 40, 866 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. కానీ అధికారులు రైతులు పండించిన పంటలో ఈసారి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యాన్ని పెట్టుకున్నారు.

నెలన్నంలో కొనుగోలు చేసింది తక్కువ

జిల్లావ్యాప్తంగా 3.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ఉన్న అధికారులు, కొన్ని ప్రాంతాలలో గన్ని బ్యాగుల పంపిణీలో ఆలస్యం మూలంగా కొనుగోలు ఆలస్యం అవుతున్నట్లు తెలిసింది. నెలన్నర సమయంలో 1,77,259.800 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. ఐకెపి కేంద్రాల ద్వారా 19, 959 రైతుల వద్ద నుంచి 90, 774.320 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించారు. పిఎసిఎస్ కేంద్రాల ద్వారా 19,885 మంది రైతుల నుంచి 81,695.400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. మెప్మా కేంద్రాల ద్వారా 1022 మంది రైతుల నుంచి 4,790.080 టన్నుల ధాన్యాన్ని సేకరించారు. జిల్లావ్యాప్తంగా 40,866 మంది రైతుల నుంచి 1,77, 259.800 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని ఇప్పటివరకు సేకరించారు. వారి లక్ష్యంలో ఇంకా సగం కొనుగోలు చేయాల్సి ఉంది. ఈసారి ముందస్తుగా వర్షాలు ఉన్నట్టు తెలుస్తున్నందున కొనుగోలు కేంద్రాలు ఎప్పటి వరకు నడుస్తాయో వాతావరణాన్ని బట్టి వేచి చూడాల్సిందే.



లారీలు రాక.... వడ్లు పోక.....

రోడ్డెక్కిన రైతన్నలు.... పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-చిలిపిచెడ్

లారీలు రాక వడ్లు పోక కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిలిచిపోయింది. బుధవారం మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో మెదక్, జోగిపేట ప్రధాన రహదారిపై రైతులు ధర్నాకు దిగారు. అనంతరం రైతులు మాట్లాడుతూ లారీలు రాకపోవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిలిచిపోయిందన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలోకి వచ్చి నెల రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు టాపర్ల కిరాయి ఎక్కువ అవుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ధాన్యాన్ని తరలించాలని రైతులు కోరరుతున్నారు.

సిద్దిపేట జిల్లాకు తరలిస్తాం

సోమక్కపేట సొసైటీ సీఈఓ పోచయ్య

ఈ విషయంపై సొమ్మక్కపేట సొసైటీ సీఈఓ పోచయ్యను వివరణ కోరగా ప్రస్తుతం ధాన్యం తరలించడానికి సిద్దిపేట జిల్లాకు అధికారులు అనుమతులు ఇచ్చారని వెంటనే ధాన్యాన్ని తరలిస్తామని తెలిపారు. మిల్లుకు పంపించిన ధాన్యాన్ని మిల్లులో దించుకోవడంలేదని లారీల కొరత ఏర్పడుతుందని అన్నారు.

పీఆర్‌సీ కమిషన్ చైర్మెన్‌ను కలిసిన టీఎన్ఎస్‌టీపి సంఘం

నవ తెలంగాణ- సిద్దిపేట



తెలంగాణ రాష్ట్ర రెండవ పిఆర్సి కమిషన్ చైర్మన్ ఎం శివశంకర్‌ను టీఎన్ఎస్‌టిపి (తెలంగాణ నాన్ స్పోస్ అసోసియేషన్) సంఘం రాష్ట్ర కమిటీ బుధవారం బీఆర్‌కె భవన్‌లో కలిసి పిఆర్‌సి ప్రతిపాదనలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి సక్కుబాయిలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు బేసిక్ పేలో 10 శాతం అదనపు అలవెన్స్ ఇవ్వాలని, భార్య భర్తలు ఇద్దరు ఉద్యోగస్తులైతే వారిద్దరు పనిచేస్తున్న ప్రాంతాల మధ్య 60 కిలోమీటర్ల దూరం కన్నా ఎక్కువ ఉన్నప్పుడు మాత్రమే ఇద్దరికీ హెచ్ఆర్‌ఏ ఇవ్వాలని, భార్యభర్తలలో ఎవరో ఒకరు ఉద్యోగస్తులైనచో వారికి నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు. ఎస్‌జీటి, ఎస్ఏల మధ్య ఉన్న పే స్కేల్ వ్యత్యాసాన్ని తగ్గించాలని, ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబ సభ్యులు మరణిస్తే వారికి 16 రోజుల కర్మకాండ సెలవులు ఇచ్చే విధంగా ప్రతిపాదించాలని, ఉద్యోగులందరికీ కామన్ హెచ్ఆర్‌ఏ ఉండాలని, పి ఆర్‌సి 40 శాతం ఇచ్చే విధంగా ఉండాలన్నారు. పిఆర్‌సి ఏరియాస్ నోషనల్‌గా నష్టపోకుండా ఏరియర్స్ ద్వారా వచ్చే నగదును ఒకేసారి చెల్లించాలన్నారు. కనీస వేతనం రూ.35000 గరిష్టంగా రూ.2.90 లక్షలు ప్రతిపాదించాలని కోరారు. 12 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఎస్‌జిటి లకు ఎస్‌ఏగా గుర్తిస్తూ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఎస్ఏగా 12 సంవత్సరాల పూర్తి చేసుకున్నట్లయితే జిహెచ్ఎంగా గుర్తిస్తూ ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. డిఎలను వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుతం ఉన్న గ్రాట్యూటీ రూ.16 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచాలన్నారు. సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్ పునరుద్ధరించాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు దేవరుషి, కృష్ణకుమారి, పద్మా రెడ్డి, రూపా రాణి, శ్రీనివాస్, శివ రాజం, సంతోష్ , కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

నవ తెలంగాణ-రాయపోల్





ఆర్టీసీ బస్సుదిగి వస్తుండగా డ్రైవర్ అజాగ్రత్త ఓ మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన రాయపోల్ మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ సకినబి దౌల్తాబాద్ నుంచి ఏపీ 28 జెడ్ 4698 నెంబర్ గల బస్సులో రాయపోల్ సొంత గ్రామం వస్తుంది. రాయపోల్ గ్రామం రాగానే బస్ స్టాప్ వద్ద బస్సు ఆగిన తర్వాత బస్సులో నుంచి దిగుతుంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ మహమ్మద్ అంజద్ పాషా ఆమె బస్సు దిగడం గమనించక అజాగ్రత్తతో బస్సును ముందుకు తీసుకువెళ్లాడు. సకినబీ బస్సు కింద పడగా ఎడమ కాలు పైనుంచి బస్సు వెనుక టైరు వెళ్ళింది. సకినబీ ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. అది గమనించిన స్థానికులు, ఇతర ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే చికిత్స నిమిత్తం సకినబీని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం లక్ష్మక్కపల్లి ఆర్విఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ మహమ్మద్ అంజద్ పాషా నిర్లక్ష్యంగా బస్సు నడపడం వలన ఈ ప్రమాదం జరిగిందని సకినబి మేనల్లుడు మహమ్మద్ షాదుల్లా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్సై రఘుపతి తెలిపారు.

ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

నవతెలంగాణ-మద్దూరు



ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కామిడీ జీవన్ రెడ్డి, మండల అధ్యక్షుడు మేక మల్లేశం, నియోజకవర్గ కోఆర్డినేటర్ అహ్మద్ అఖిల్ పాషా కోరారు. బుధవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీగా గెలిపించి పెద్దల సభకు పంపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ముస్యాల మనోహర్, మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి బూర్గు శంకర్, పిఎసిఎస్ డైరెక్టర్ కాటం బాలయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు ఎఫ్ఎం షౌకత్ అలీ, బొంగురం శేఖర్ రెడ్డి, గణేష్, ప్రకాశం, నాయకులు ఇట్టబోయిన కనక చంద్రం, గద్దల మహేందర్, బందరం శ్రీనివాస్, ఆరిఫ్, పరమేశ్వర్, నీరటి కిషోర్ పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓ అకస్మిక తనిఖీ..

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని తోటపల్లి ఆరోగ్య కేంద్రాన్ని డీఎం హెచ్ఓ పుట్ల శ్రీనివాస్ బుధవారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేసి మందుల నిలువలు, రాష్ట్ర, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల రికార్డులను నమోదు చేసి, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం వైద్యులు క్రిష్ణ తేజ్, ఫార్మాసిస్ట్ అనురాధ, సూపర్ వైజర్ కళావతి, ఎల్డీ కంప్యూటర్ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని త్వరగా పూర్తి చేయాలి..

తోటపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా గుత్తేదారుకు అదేశించాలని డీఎంహెచ్ఓ వైద్యులు క్రిష్ణ తేజ్‌కు సూచించారు.

నవతెలంగాణ

నమ్మిన తెలుగు దినపత్రిక

సంగారెడ్డి

గురువారం | 16 మే 2024 | www.navatelangana.com

కొండల్‌రెడ్డిని పరామర్శించిన గిరిధర్‌రెడ్డి



నవతెలంగాణ-జహీరాబాద్

మండలంలోని బూచినేల్లీ గ్రామానికి చెందిన రైతు సంఘం నాయకులు గుడుపల్లీ కొండల్ రెడ్డి తండ్రి కీర్తిశేషులు కమాల్ రెడ్డి దశ దిన కర్మలో తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ యస్.గిరిధర్‌రెడ్డి పాల్గొని.. కొండల్‌రెడ్డిని పరామర్శించారు. ఆయనతో పాటు జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రానికి పెయింటింగ్ పనులు



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని చిన్నచెల్మడ గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రం సకల సౌకర్యాలతో ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్నది. మండలంలోని బుదేరా భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజర్ సురేష్ కుమార్ చొరవతో అంగన్వాడి కేంద్రానికి పెయింటింగ్ పనులు చేపట్టారు. అదేవిధంగా కేంద్రానికి ఒక స్మార్ట్ టీవీతో పాటు, నీటి శుద్ధి యంత్రం, కుర్చీలు, ఆట వస్తువులు విద్యార్థులకు ప్లేట్ల గ్లాసులు పంపిణీ చేశారు. సామాజిక బాధ్యతగా తీసుకుని చిన్న చెల్మడ అంగన్వాడి కేంద్రానికి నూతన శోభను అందించిన బుదేరా భారతీయ స్టేట్ బ్యాంకు మేనేజర్ మరియు సిబ్బంది గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సురేష్ తో పాటు అంగన్వాడీ కార్యకర్త మీనాక్షి, పంచాయతీ కార్యదర్శి అనిల్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రమేష్



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ పాస్ అయిన వారు అర్హులని, వెబ్ ఆప్షన్లు ఈనెల 20వ తేదీ వరకు పెట్టుకోవచ్చని సూచించారు. వివిధ కోర్సుల కోసం దోస్త్ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు సమర్పించాలన్నారు.

బోరంచలో నేటి నుంచి పోచమ్మ జాతర

నవతెలంగాణ-మనూర్

మండలంలోని బోరంచ గ్రామంలో గల నల్ల పోచమ్మ జాతర మహోత్సవాలు నేటి(గురువారం) నుంచి ప్రారంభం అవుతాయాని ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 27వరకు అమ్మవారికీ రుద్రభిషేకం, విశిష్ట పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ జాతరకు తెలుగు రాష్ట్ర ప్రజలే కాక మహారాష్ట్ర, కర్నాటక నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని ఆయన తెలిపారు.




ట్రైడెంట్ కార్మికుల సమస్యకు

పరిష్కారమెన్నడో..

- మూడు అడుగులు ముందుకు.. ఐదు అడుగులు వెనక్కు అన్నట్టుగా పరిశ్రమ తీరు
- ఏండ్ల నుంచి ఇబ్బంది పడుతున్న కార్మికులు, రైతులు
- వెంటనే ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ నియోజకవర్గానికి ఆణిముత్యం లాంటి ట్రైడెంట్ చక్కర పరిశ్రమ సమస్య రోజురోజుకు మూడు అడుగులు ముందుకు.. ఐదు అడుగులు వెనుకకు అన్న చందాగా నడుస్తున్నది. ఇటీవలే రైతులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు చెల్లించిన విషయం విధితమే. కానీ పరిశ్రమ కార్మికులకు మాత్రం పెండింగ్ వేతనాలు అలాగే ఉండడంతో.. మరోమారు పరిశ్రమలో ఆందోళనలు మొదలయ్యాయి. యాజమాన్యం హామీలతో ప్రతీరోజు పరిశ్రమకు వస్తున్నా.. వేతనాలు మాత్రం ఇవ్వకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు నిరసనలు చెబుతున్నారు. ఈ క్రమంలో వచ్చే సోమవారం నాటికీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చినప్పటికీ.. పరిశ్రమలో రైతులకు, కార్మికులకు పూర్తి బకాయిలు చెల్లించి.. స్వేచ్ఛగా క్రషింగ్ చేపట్టే పరిస్థితి ఏనాటికి వస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వమే చొరవ చూపి ఈ పరిశ్రమను కాపాడుకోవాలని కోరుతున్నారు.

ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినప్పటి నుంచే సమస్య..

ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్న నాటి తెలుగు దేశం ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు ఈ పరిశ్రమను విక్రయించడంతో కార్మికులు, రైతుల పరిస్థితి అగోమ్యగోచరంగా మారింది. నాటి నుంచి ఇప్పటికే పరిశ్రమలో పదుల సంఖ్యలో యజమాన్యాలు మారినప్పటికీ కార్మికుల సమస్యలు మాత్రం ఎక్కడివక్కడే ఉన్నాయి. రాష్ట్రం ఏర్పడిన అనంతరం చక్కెర పరిశ్రమలన్నింటినీ తిరిగి కొనుగోలు చేస్తామని గత పాలకులు ప్రకటించినా..ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దాంతో ఈ సమస్య నేటికీ అలాగే కొనసాగుతున్నది. కాగా నాలుగు నెలల క్రితం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒక అడుగు ముందుకు వేసి నిజాం చక్కర పరిశ్రమలన్నింటినీ తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటామని ప్రకటించింది. అందుకు సంబంధించి ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. దాంతో చెరకు రైతులు, ట్రైడెంట్ పరిశ్రమ కార్మికులు సంతోషం వ్యక్తం చేసినా.. నేటికీ మరో ముందడుగు లేకపోవడంతో మళ్లీ భయం మొదలైంది.

జహీరాబాద్‌లోని ఈ ట్రైడెంట్ పరిశ్రమలో ఉత్పత్తి అవుతున్న చక్కర నాణ్యమైనదిగా ఉండడంతో.. దేశ విదేశాల్లో ఇక్కడి చక్కరకు మంచి డిమాండ్ వస్తుంది. దాంతో ఈ పరిశ్రమను కొనుగోలు చేసేందుకు నాడు పెద్ద సంఖ్యలో కొనుగోదారులు పోటీపడ్డారు. కానీ తదుపరి పరిశ్రమలో సరైన విధంగా యంత్రాలను సమకూర్చకపో వడంతో పాటు కార్మికులకు, రైతులకు డబ్బులు చెల్లించకపోవడంతో తరచుగా యజమాన్యాలు మారుతూ వస్తున్నాయి. ప్రస్తుతం పరిశ్రమలో 164 మంది కార్మికులు ఉన్నారు. గత సంవత్సరం ఈ పరిశ్రమలో చరకును గానుగాడించకపోగా.. రైతులకు బకాయపడి ఉన్న డబ్బులను చెల్లించేందుకు ఆర్ఆర్ యాక్టివ్ సైతం ప్రభుత్వం వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుల డబ్బులను చెల్లించినప్పటికీ కార్మికులకు పాత యజమాన్యం బాకీ ఉన్న జీతాలు సుమారు అయిదున్నర కోట్లు బాకీ అలాగే ఉన్నట్టు.. కార్మిక నాయకులు చెబుతున్నారు. దాంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఎల్ఐసి డబ్బులు సైతం చెల్లించడం లేదని వాపోతున్నారు. గతేడాదికి సంబంధించిన 11 నెలల జీతం పరిశ్రమ యజమాన్యం కార్మికులకు బకాయపడి ఉంది. ఈ డబ్బులు గతంలో ఉన్న యజమాన్యం చెల్లించనందున కార్మికుల సమస్య దినదిన గండంగా మారుతున్నది. ఇప్పటికే ఈ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న 20 మంది కార్మికులు మృతి చెందగా.. వారికి ఒక్క రూపాయి కూడా బెనిఫిట్ లభించలేదు. రిటైర్మెంట్ అయిన కార్మికులకు కూడా ఏ విధమైన బెనిఫిట్స్ లభించలేదని వారు చెబుతున్నారు. ఎన్నికల ముందు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభ ను అడ్డుకుంటామని రైతులు, కార్మికులు ప్రకటించిన వెంట నే పరిశ్రమ ఎండిని అధికా రులు పిలిపించి రెండ్రోజుల్లో కార్మికుల డబ్బులను చెల్లిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చి రైతుల ఆందోళనలు విరమింప చేశారు. దాంతో వారు ఆ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు సహకరించారు. కానీ తదుపరి రైతుల గురించి ఎవరు కూడా పట్టించుకోకపోవడంతో కార్మి కుల సమస్య ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందగా మారింది. కార్మి కులు రోజువారీగా పరిశ్రమ వద్దకు వచ్చి రిజిస్టర్‌ల అటెండెన్స్ వేయించి వెళ్ళిపో తున్నారు. కానీ వారికి జీతాలు లభించకపోవడంతో వారి కుటుంబాల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. తమ పిల్లలకు ఫీజులు చెల్లించలేక యుక్త వయసుకు వచ్చిన వారి కి వివాహాలు చేయలేక అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే సమస్య జఠిలం



ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగానే పరిశ్రమలో కార్మికులసమస్య జఠిలంగా మారుతున్నది. ఇప్పటికైనా సీఎం ఇచ్చిన హామీ మేరకు జహీరాబాద్ చక్కర పరిశ్రమను ప్రభుత్వం కొనుగోలు చేసి నడిపించాలి. రైతులబాకీ డబ్బులను చెల్లించి ఆదుకోవాలి.

- రాములు యాదవ్

రేపే కూతురు వివాహం.. చేతిలో చిల్లిగవ్వ లేదు



రేపే(శుక్రవారం) మా కూతురి వివాహం ఉన్నది. చేతిలో చిల్లిగవ్వ లేదు. పరిశ్రమ వేతనాలు ఇస్తుందనుకుంటే.. ఇప్పటికీ ఇవ్వలేదు. దాంతో ఏం చేయాలో తెలియక పొగగొట్టం ఎక్కి నా భర్త ఆత్మహత్యాయయత్నం చేశాడు. ఇప్పటికైనా పెండింగ్ జీతం ఇచ్చి.. ఆదుకోవాలి.

- కార్మికుడు రమేష్ భార్య

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

తహసీల్దార్ కార్యాలయానికి తరిస్తుండగా అధికారుల కన్నుగప్పి పరార్..

నవతెలంగాణ-వట్‌పల్లి

అక్రమంగా తరలిస్తున్న మట్టి ట్రాక్టర్లను ఇరిగేషన్ అధికారులు పట్టుకుని.. తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తుండగా అధికారులు కన్నుగప్పి ట్రాక్టర్‌లతోపాటు నిందితులు పరారయ్యారు. ఈ ఘటన మండలంలోని బిజిలీపూర్‌లో బుధవారం జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. బిజిలీపుర్ గ్రామ



శివారులోని చెరువు నుండి అక్రమంగా మట్టి మాఫియా జరుగున్నదనే సమాచారంతో.. రెవున్యూ అధికారులు దాడులు జరిపి ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఆ ట్రాక్టర్లను తాసిల్దార్ కార్యాలయానికి తరలిస్తున్న క్రమంలో.. అధికారులతో వస్తున్నట్టే వచ్చి వారి కన్నుగప్పి ట్రాక్టర్లతో సహా నిందితులు పరారయ్యారు. ఇరిగేషన్ అధికారులు పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ లేకుండా పోయింది. దాంతో ఈ విషయమై పోలీస్ అధికారులకు వ ఫిర్యాదు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని వదిలిపెట్టబోమని పోలీస్ అధికారుల సహాయంతో స్వాధీనం చేసుకుంటామని ఇరిగేషన్ ఏఈ నాగరాజు తెలిపారు.

ఉపాధి డబ్బులు చెల్లించండి సారూ..

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏడాకులపల్లి గ్రామ ఉపాధి కూలీల నిరసన

- రెండు నెలలుగా డబ్బులు అందడం లేదు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం
- కూలీల ఆవేదన

నవతెలంగాణ-ఝరాసంగం

చేసిన పనికి డబ్బులు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. వెంటనే తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఏడాకులపల్లి గ్రామ ఉపాధి హామీ కూలీలు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. గ్రామానికి చెందిన పోస్ట్‌మాన్ డబ్బులు ఇవ్వడం లేదని మొరపెట్టుకున్నారు. ఉపాధి హామీ చట్టంలో సుమారు 200 మంది కూలీలం పని చేస్తున్నామన్నారు. ఉపాధి కూలీ డబ్బులు ఇవ్వాలని పోస్ట్‌మ్యాన్‌కు రెండు నెలల నుంచి వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. పైగా 'నా పై ఎవ్వరికీ ఫిర్యాదు చేస్తారో చేసుకపోండి' అని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. కూలీ డబ్బులు రాకపోవడంతో ఇతరుల వద్ద డబ్బులు అప్పు తీసుకొని నిత్యావసర సరుకులు తెచ్చుకుంటున్నామన్నారు. నెలవారీ వాయిదాలను సైతం చెల్లించుకోలేని పరిస్థితి ఉన్నదని వాపోయారు. ఫీల్డ్ అసిస్టెంట్ తనకు ఏమీ పట్టినట్టు వ్యవహరిస్తున్నాడని డబ్బులు చెల్లింపు విషయంలో చొరవ తీసుకోవడంలేదన్నారు. ఉపాధి డబ్బులు చెల్లించమని పోస్ట్‌మాన్‌కు అడిగితే గ్రామంలోని పెత్తందారులకు (పాటిల్) అడగండని సమాధానం ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు రావాల్సిన కూలీ డబ్బులు ఇప్పించాలని కోరారు. నిరసన తెలిపిన వారిలో సమ్మయ్య, అంజయ్య, సుభాష్, బాబు, దేవప్ప, సంగమేశ్ తదితరులు ఉన్నారు.

ఎప్పటికప్పుడు ఎంబిలను పూర్తి చేస్తున్నాం

ఉపాధి హామీ కూలీలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఎంబిలను పూర్తి చేసి పై అధికారులకు పంపిస్తున్నాం. డైరెక్ట్‌గా ఉపాధి కూలీల ఖాతాలలోనే డబ్బులు జమవుతున్నాయి. ఉపాధి కూలీలందరికీ బ్యాంకు ఖాతాలే ఉన్నాయి. అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో పోస్ట్ ఆఫీస్ ఖాతాలు ఉన్నాయి. ఎన్నికలు ఉండడం వల్ల రెండు నెలల కూలి డబ్బులు పెండింగ్లో ఉన్నాయి.

- ఎంపీడీవో సుధాకర్, ఝరాసంగం





ఆయిల్‌పామ్ సాగుతో మంచి లాభాలు

పంట సాగుపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-ఝరాసంగం

రైతులు ఆయిల్ పామ్ పంటను సాగుచేయడం వల్ల మంచి లాభాలు పొందుతారని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సోమేశ్వరావు తెలిపారు. మండలంలోని కుప్పానగ ర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అయిలుపామ్ సాగుపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పంట ను ఒకసారి వేసుకుంటే 4వ ఏడాది నుంచి 25 సంవత్సరాల వరకు రైతుకు స్థిరమైన ఆదాయం వస్తుందన్నారు. చీడపీడల బెడద చాలా తక్కువగా ఉంటుందన్నారు. దాదాపు అన్ని రకాల నేలలు అనుకూలమని చౌడు, జాలు పొలాలు తప్ప అనీ పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటుకునే రైతు లకు మొక్కలకు రూ.11,600, డ్రిప్‌కు రూ.22,518, ఎరు వులకు, అంతర పంటసాగుకు నాలుగు సంవత్సరాల పాటు రూ.16800 ఒక ఎకరానికి సబ్సిడీని ఉద్యానశాఖ ద్వారా రైతులకు అందుతుందన్నారు. అనంత రం గ్రామంలో సాగు చేస్తున్న పంటను క్షేత్రస్థాయిలో వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధి కారిణి స్పందన, గోద్రెజ్ ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు, గోద్రెజ్ ఫీల్డ్ ఆఫీసర్స్ భరత్, ఏసుబాబు రైతులు తదితరులు పాల్గొన్నారు



లాఠీఛార్జ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఉపాధ్యాయుల సస్పెన్షన్లను ఎత్తివేయాలి
- 5 రోజుల రెమ్యూనరేషన్ చెల్లించాలి
- ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో డీఆర్ఓకు వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి

నారాయణఖేడ్‌లో రెమ్యూనరేషన్ అడిగిన ఉపాధ్యాయులపై లాఠీచార్జీ చేయించిన ఆర్డిఓ, సీఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణికి బుధవారం వినతి పత్రం అందజేశారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞానమంజరి, టీపీటీఎఫ్ అధ్యక్షులు నాగారం శ్రీనివాస్, ఎస్టీయూ అధ్యక్షులు సయ్యద్ సాబెర్ అలీ, పీఆర్టీయూ అధ్యక్షులు గుండు లక్ష్మణ్, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సాయిలు, యస్సి ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శుభాన్ సింగ్, దుర్గయ్య తదితరులు మాట్లాడుతూ.. పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా (పిఓ, ఎపిఓ, ఓపిఓ లకు) ఒకే విధంగా రెమ్యూనరేషన్ చెల్లించాలని మే 11న 691 ఉత్తర్వులు ఈసీ జారీ చేసిందని గుర్తు చేశారు. అందుకను గుణంగా సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి ఇతర జిల్లాలతో సమానంగా రేమునరేషన్ చెల్లించాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, నర్సాపూర్, గజ్వేల్, మెదక్ కేంద్రాల్లో ఇతర జిల్లాల్లో 5 రోజులకు రేమ్యూనరేషన్ చెల్లించారన్నారు. అదే పద్ధతిలో నారాయణఖేడ్‌లో కూడా 5 రోజులకు చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై అమానుషంగా లాఠీచార్జీ చేయడం హేయమైన చర్య అన్నారు. అరకొర వసతుల మధ్య, సరిపోని నీళ్లు, భోజనం, తీవ్రమైన ఎండలు, అన్నారోగ్య సమస్యలతో కూడా ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా ముగించుకొని, కేవలం న్యాయబద్ధంగా రావాల్సిన ఒకరోజు రెమ్యూనరేషన్ అడిగినందుకు అధికారులు ఉపాధ్యాయులపై లాఠీలు ఝలిపించడం అమానవీయ చర్యగా ఉపాధ్యాయ సంఘాలు ఖండిస్తున్నాయన్నారు. లాఠీ చార్జీకి బాధ్యులైన నారాయణఖేడ్ ఆర్డిఓ, సీఐ, ఎస్ఐలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చు తల్లులు, అంగ వైకల్యం, 6 నెలలలోపు పదవి విరమణ పొందే వారికి ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరినప్పటికీ, వివిధ అనారోగ్య సమస్యలు, ఇతర కారణాలతో ఎన్నికల శిక్షణకు హాజరు కానీ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సమంజసం కాదన్నారు. కొంతమంది టీచర్లు రెండు ట్రైనింగ్‌లకు హాజరైన గానీ, మరి కొంతమంది మొదటి ట్రైనింగ్‌కు హాజరై రెండో ట్రైనింగ్‌కు ముందు అనుమతి కోసం దరఖాస్తు పెట్టుకున్నా కూడా సస్పెండ్ చేశారన్నారు. అధికారుల తప్పిదానికి టీచర్లను బలి చేయడం సమంజసం కాదన్నారు. సస్పెండ్ అయిన ఉపాధ్యాయులను తిరిగి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సిబ్బందికి 5 రోజుల రెమ్యూనరేషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు లక్ష్మయ్య యాదవ్, పి. శ్రీనివాసరావు, సోమశేఖర్, శామయ్య భాస్కర్, విజయ్ భాస్కర్, సాయితేజ, పాండు రంగారెడ్డి, ఆర్. శ్యాంప్రసాద్, పుండరీకం, జి.ప్రభాకర్, సంతోష్ కుమార్, పత్రి కిషన్, గోపాల్, దుర్గయ్య, పి.నరేందర్, యాదయ్య భూమి శ్రీనివాస్, సాయిలు, మొగులయ్య, నాగేశ్వర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



రైతులు పంటల నమోదు చేసుకోవాలి

సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ

నవతెలంగాణ-రాయికోడ్

వాన కాలంలో రైతులు పంటల నమోదు చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రమైన రాయికోడ్‌లోని రైతు వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో వ్యవసాయ విస్తరణ అధికారులందరూ తమ తమ రైతు వేదికల్లో రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. రైతుబంధు, రైతుబీమా సంబంధించిన వివరాలు రైతులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఫర్టిలైజర్స్ డీలర్లతో మాట్లాడుతూ.. డీలర్లు అందరూ ఫైనాన్స్ లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలన్నారు. రైతులు ఆధార్ కార్డులతో ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. పురుగుల మందులు, విత్తనాలు సరసమైన ధరలకే విక్రయించాలన్నారు. పత్తి విత్తన రకమైన బీటీ-3 రకాన్ని ఎవరు కూడా విక్రయించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అవినాష్ వర్మ, రైతులు, ఫర్టిలైజర్స్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
గురువారం | 16 మే 2024 | www.navatelangana.com

వడ్లను వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

- తహశీల్దార్ క్రిష్ణను కోరిన నాయికోటి భాస్కర్



నవతెలంగాణ-టేక్మాల్

వడ్లను వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని నవ్య భారతి యువజన సంఘం అధ్యక్షులు నాయకోటి భాస్కర్ ఆధ్వర్యంలో రైతులు తహశీల్దార్ క్రిష్ణను కోరారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన వరి కొనుకోలు కేంద్రాలకు లారీలు సరిగా రాకపోవడంతో రైతులు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. గత వారం రోజులుగా ఈదురు గాలులతో వర్షాలు కురుస్తున్నాయని, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వడ్లు తడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున వెంటనే లారీలను రప్పించి సెంటర్లలో ఉన్న వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. ఈ మేరకు తహశీల్దార్ క్రిష్ణ స్పందించి ఉన్నతాధికారులకు చరవాణిలో సమాచారం ఇవ్వడం జరిగిందని, సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సాధు కిషన్, ఎల్లుపేట అంజయ్య, కేశిరెడ్డి, నాయికోటి శివరాజ్, మెరుగు రాములు, తంపులూరి కేశవులు, బోయిని అంబేష్ చాకలి ఎల్లయ్య, తలారి రాములు, వడ్ల ప్రసాద్, రాములు, సాయిలు, రైతులు పాల్గొన్నారు.

బాల పురస్కార్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి బ్రహ్మాజీ

నవతెలంగాణ-మెదక్

రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డ్ కోసం అర్హులైన చిన్నారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి బ్రహ్మాజీ బుధవారం తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2024-25 లో భాగంగా అందించనున్న బాలశక్తి పురస్కార్ అవార్డులకు 31-07-2024 వ తేదీలోగా ఆన్‌లైనులో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 06 నుంచి 18 ఏళ్ల లోపు బాల బాలికలు వివిద రంగాలలో ఆవిష్కరణ, సృజనాత్మకత, మంచి అభ్యాస వాతావరణం, సాంస్కృతిక కళలు, సాహసం, క్రీడలు, సామజిక సేవ, శాస్త్ర, సాంకేతిక, ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన బాల బాలికలు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులపై లాటి చార్జిని ఖండిస్తున్నాం

- తపస్ మెదక్ జిల్లా శాఖ



నవతెలంగాణ-చేగుంట

లోక్ సభ ఎన్నికల్లో పాల్గొన్న ఉద్యోగులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు నారాయణఖేడ్‌లో సోమవారం రాత్రి ఎన్నికల సిబ్బందిపై లాఠీ ఛార్జి చేయడాన్ని తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. పట్టణ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తపస్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొని ఎన్నికలు సజావుగా నిర్వహించి నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై లాఠీ ఛార్జి చేయడం దారుణమన్నారు. ఈ దాడికి కారణమైన అధికారులపై రాష్ట్ర ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇటువంటి పొరపాట్లు భవిష్యత్తులో జరగకుండా చూడాలని, ఎన్నికల సిబ్బందికి ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ బాధ్యులు సురేందర్, రావుల వెంకటేష్, సంతోష్ కుమార్, ప్రవీణ్, పట్లూరి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

మూలమలుపు ప్రమాదాల వలన మరణాలు

- కనిపించని సూచక బోర్డులు
- చెట్ల పొదల్లో మైలురాళ్ళు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



నవతెలంగాణ -వెల్దుర్తి

మండల వ్యాప్తంగా ప్రధాన రహదారులపై మూలమలుపు ప్రమాదాలు జరిగి మరణాలు సభవిస్తున్నాయి. సూచిక బోర్డులు గతంలో ఏర్పాటు చేసిన గాలి దుమారానికి నేలకొరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మైలు రాళ్ళు కాస్త చెట్లపొదలతో మునిగి ఉన్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం పరిధిలోని ఉప్పులింగాపూర్ హల్దీ వాగుపై బ్రిడ్జి, ధర్మారం గేట్, దామరంచ, మన్నె వారి జలాల్పూర్, గ్రామాల వద్ద మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో దామరంచ మూల మలుపు వద్ద శివంపేట గ్రామానికి చెందిన కానిస్టేబుల్ ప్రమాదానికి గురయ్యారు. ధర్మారం గేటు మూల మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో శివంపేట మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మెదక్ నుంచి మంగళపర్తికి ట్రాక్టర్ వెళ్తున్న ఓ వ్యక్తి మూల మలుపు వద్ద డ్రాక్టర్ అదుపుతప్పి బ్రిడ్జి పై నుంచి హల్దీ వాగు బ్రిడ్జిపై నుంచి పడి మృతి చెందాడు ఇలా మూలమలుపుల వద్ద నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటూనే ఉంది. ప్రాణాలు కోల్పోతున్న అధికారులు మాత్రం చలనం లేకుండా పోయింది. మూల మలుపుల వద్ద సూచిక బోర్డుల పునరుద్ధరించాలని వాహనదారులు కోరినా పట్టించుకునే నాథుడే లేడు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు గడ్డి పొదలు గుబురుగా పెరగడంతో మైలు రాళ్ళు కనిపించకుండా ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కూడా చెట్ల పొదలతో కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజల వాహనదారులు ఇబ్బందులను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రోగులను హడలెత్తిస్తున్న 'సాయికృష్ణ హాస్పటల్'

- తప్పుడు మెడికల్ రిపోర్టులిచ్చి భయపెడుతున్న వైనం..
- గర్భిణికి హెపటైటిస్ బి (ఎదీ ాఆస్ట్ర) పాజిటివ్ రిపోర్ట్
- ఆమెకే ప్రభుత్వ ఆసుపత్రిలో హెపటైటిస్ బి నెగిటీవ్



నవతెలంగాణ-రామాయంపేట

దేవుడి తర్వాత చేతులెత్తి మొక్కేది డాక్టర్లకే. కొబ్బరికాయలు గుడి ముందు కొడతారు, ఆ తరువాత ఆసుపత్రి ముందే కొబ్బరికాయలు కొట్టడం కనిపిస్తుంది. దేవుడి స్థానంలో ఉన్న ఓ ఆసుపత్రి యాజమాన్యం, మానవతా దృక్పథాన్ని మరచి, రోగుల నుంచి లక్షలు లాగడమే పరమావధిగా వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. రామాయంపేట పట్టణంలోని సాయి కృష్ణ ఆసుపత్రిలో రోగులకు తప్పుడు రిపోర్టులతో భయపెట్టి, చికిత్స కోసం పెద్ద ఎత్తున డబ్బులు లాగుతున్నట్టుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గర్భిణీకి హైపటైటిస్ బి పాజిటివ్ ఉన్నట్టు తప్పుడు రిపోర్ట్

రామాయంపేట పట్టణానికి చెందిన బసన్నపల్లి శృతి అనే అమ్మాయి గత ఐదు నెలలుగా ప్రతినెల సాయి కృష్ణ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకుంటూ చికిత్స తీసుకుంటుంది. అలాగే ఈ నెల 6న పరీక్షల కోసం సాయి కృష్ణ ఆస్పత్రిలోని డాక్టర్లను సంప్రదించింది. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించిన అనంతరం హైపెటైటిస్ బి (HB s Ag) అనే లివర్‌కు సంబంధించిన సమస్య ఉందని వైద్యులు తెలిపినట్టు బాధితులు 'నవతెలంగాణ'తో తెలిపారు. ఈ సమస్య ఉన్నవారికి డెలివరీ సమయంలో సర్జరీ అవసరమైతే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అని వైద్యులు తెలిపినట్టు వారు వివరించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో హెపటైటిస్ బి (HB s Ag) నెగిటీవ్

తమ కూతురికి ఉన్నది పెద్ద సమస్య అని భావించిన శృతి తండ్రి శ్రీశైలం, సన్నిహితుల సలహా మేరకు స్థానిక ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్ష చేయించాడు. కానీ అక్కడ హెపటైటిస్ బి (HB s Ag) నెగిటీవ్ రిపోర్టు వచ్చింది. సాయి కృష్ణ ఆసుపత్రిలో పాజిటివ్ వచ్చిన రిపోర్టు, తమ ల్యాబ్‌లో నెగిటివ్ రావడంతో, ఆ ల్యాబ్ నిర్వాహకులు తిరిగి పలుమార్లు పరీక్ష చేశారు. మళ్లీ నెగిటివ్ రిపోర్టే వచ్చింది. ఆ ప్రైవేటు ల్యాబ్‌లో రిపోర్టు ఇవ్వకుండా రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి పరీక్షల నిమిత్తం పంపించారు. అక్కడ కూడా హెపటైటిస్ బి (HB s Ag) నెగిటీవ్ రిపోర్టు వచ్చింది. సాయి కృష్ణ ఆసుపత్రిలో బ్లడ్ గ్రూప్ రిపోర్టు కూడా తప్పే ఇవ్వడం జరిగింది. అక్కడ శృతికి బ్లడ్ గ్రూప్ 'A' పాజిటివ్ రిపోర్టు ఇచ్చారు. రామయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేసిన రిపోర్టులో 'B' పాజిటివ్ ఉంది.

గతంలోనూ సాయి కృష్ణ ఆసుపత్రిలో తప్పుడు రిపోర్టులు ఇచ్చి భయభ్రాంతులకు గురి చేయడం, అవసరం లేని చికిత్సలు చేసి డబ్బులు లాగుతున్నారంటూ పెద్ద ఎత్తున ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తూ బసన్నపల్లి శృతికి తప్పుడు రిపోర్టులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై వివరణ కోసం జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.





తీవ్ర మనోవేదనకు గురయ్యాను


తన కూతురుకు లేని జబ్బు (హెపటైటిస్ బి) ఉందని సాయి కృష్ణ హాస్పిటల్ డాక్టర్ తెలపడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాను. భయపడుతూనే ఇక్కడి నుంచి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాను. అక్కడ తిరిగి మరుసటి రోజు రమ్మన్నారు. మరుసటి రోజు వరకు ఆగలేక స్నేహితుల సలహా మేరకు స్థానిక ప్రైవేటు ల్యాబ్‌లో, ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించగా HB s Ag నెగిటివ్ రిపోర్టు వచ్చింది.




- బాధితురాలి తండ్రి శ్రీశైలం

మండల కేంద్రంలో నిలిచిపోయిన జాతీయ రహదారి పనులు

- ఇబ్బందులు పడుతున్న వాహనాదారులు
- వెంటనే పనులు మొదలు పెట్టాలని గ్రామస్తుల వేడుకోలు





నవతెలంగాణ-నిజాంపేట

రవాణా సౌకర్యం సౌలభ్యం కోసం భారత ప్రభుత్వం జాతీయ రహదారులను నిర్మిస్తున్న సందర్భంలో వరంగల్ జిల్లా హసన్పర్తి నుంచి మెదక్ పట్టణం వరకు డబల్ రోడ్డును వందల కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నది. మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో ఒక సైడు వేసి ఇంకొక సైడ్ కు రోడ్డు పనులను నిలిపివేయడం జరిగింది. దాదాపుగా 3 నెలల నుంచి రోడ్డు పనులు జరగడం లేదంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వచ్చి పోయే వాహనదారులకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డు వేయకపోవడంతో మట్టి రోడ్డుపై నీరు నిలిచి అనేక ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్డు కాంట్రాక్టర్లను అడుగగా మిషన్ భగీరథ పైప్‌లైన్ కాంట్రాక్టర్లు పైప్‌లైన్‌లను ఫిట్ చేయకపోవడం వలన పనులు ఆలస్యంగా జరుగుతున్నాయంటూ సమాధానాలు చెప్తున్నారు. మిషన్ భగీరథ పైప్లైన్ త్వరగా ఫీట్ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఏది ఏమైనప్పటికీ నిజాంపేట మండల కేంద్రంలోని జాతీయ రహదారి పనులను వెంటనే మొదలు పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే జాతీయ రహదారి పనులను మొదలు పెట్టేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాతీయ రహదారి పనులను వెంటనే ప్రారంభించాలి



ఒకపక్క రోడ్డు వేసి ఇంకొకపక్క రోడ్డు వేయకపోవడం వలన వచ్చి పోయే వాహనదారులకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. 3 నెలల నుంచి రోడ్డు పనులు జరగడం లేదు. మిషన్ భగీరథ కాంట్రాక్టర్ వెంటనే పైపులైన్లను ఫిట్ చేయాలని, అధికారులు స్పందించి రోడ్డు పనులను మొదలు పెట్టేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

జీడి నారా గౌడ్, కాసిం పూర్, గ్రామవాసి

ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ హేయమైన చర్య

- నారాయణఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి
- టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు

నవతెలంగాణ-మెదక్

ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ హేయమైన చర్య అని, ఇందుకు కారణమైన నారాయణఖేడ్ ఆర్డీఒపై చర్య తీసుకోవాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు పేర్కొన్నారు. బుధవారం టీఎస్ యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీ చార్జి చేయించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేసిన ఆర్డీఒ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, పిఒ, ఎపిఒ లకు రోజుకు రూ. 600, ఒపిఒ లకు రూ.400 రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెం. 691ని ఈ నెల 11న విడుదల చేసిందన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారమే మెదక్ నియోజకవర్గం పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్ధిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పిఒ, ఎపిఒలకు రూ. 3150లు చెల్లించగా, నారాయణఖేడ్‌లో రూ 2400 మాత్రమే ఇచ్చారని తెలిపారు. ఈసీ ఆదేశాలకు విరుద్ధంగా సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో తక్కువ పారితోషకం చెల్లించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఒకే పార్లమెంట్ నియోజక వర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, జిల్లా నాయకులు సాయి తేజ, కేశవరావు, ప్రభాకర్, సుధాకర్, అనురాధ ఇతర ఉపాధ్యాయుల, ఉద్యోగులపై ఆర్డీఒ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి ఉపాధ్యా యులను గాయపరిచారని తెలిపారు. నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయుల పై దౌర్జన్యం చేసిన ఆర్డీఒ, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై చరణ్ రెడ్డి పోలీసుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు, ఉపాధ్యక్షులు అజయ్, కోశాధికారి రవింద్ రెడ్డి, కార్యదర్శులు సుధాకర్ బిమ్లా నాయక్ ,యేసయ్య షాకిర్ అలీ ప్రేమ్ కుమార్ ప్రభాకర్ మొదలైన వారు పాల్గొన్నారు.



చక్రధర్ గౌడ్ ఆధ్వర్యంలో నగదు, బియ్యం పంపిణీ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మెన్, సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు చక్రధర్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం అబాగ్యురాలైన శామంతుల మల్లవ్వ (యెడ్డవ్వ) కు ఐదు వేల ఆర్థిక సహాయం పంపించారు. అదే విధంగా కాంగ్రెస్ కార్యకర్త వర్ధోలు శ్రీకాంత్ వల్ల అమ్మమ్మ అకాల మరణం చెందడంతో వారికి 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రంగు అశోక్ గౌడ్, గ్రామ అధ్యక్షులు దండవేని రాజేందర్, ప్రధాన కార్యదర్శి వర్ధోలు ఐలయ్య, వర్ధోలు శ్రీనివాసు, బోగి శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షులు వర్ధోలు సాగర్ యాదవ్, సంద బోయిన రవి, గుండెల్లి కొమురయ్య, దున్నపోతుల సంపత్, గీకూరు రాజు , ఏటి భిక్షపతి, గుండెల్లి పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచల ముత్యాల తలంబ్రాల పంపిణీ



నవతెలంగాణ-గజ్వేల్

రామ నామమే ప్రాణమని గత 20 సంవత్సరాల నుంచి యెలగందుల సుకేందర్ సార్ దంపతులు (రిటైర్డ్ ఎంఈవో) కోట్లాది సంఖ్యలో రామ నామాలు లిఖించిన ఘనత కుటుంబానికి ఉందని రామకోటి రామరాజు అన్నారు. బుధవారం అలాగే ప్రముఖ వ్యాపార వేత్త బొడ్డు రమేష్, దంపతులకు కూడా శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు శాలువా కప్పి భద్రాచల దేవస్థాన ముత్యాల తలంబ్రాలు, స్వామి వారి శేషవస్త్రాలు అందజేశారు. భద్రాచల ముత్యాల తలంబ్రాలు తమకు అందడం చాలా ఆనందంగా ఉందని భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

వడ్ల కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి

బర్దాన్ కొరత వల్ల ఆగిన కాంటాలు

ఉన్నతాధికారులు పట్టించుకోవాలి

సీపీఐ (ఎం) మండల కార్యదర్శి సత్తిరెడ్డి



నవతెలంగాణ-కొమురవెల్లి

మండలంలో వడ్ల కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని కొన్ని కేంద్రాల్లో గన్నీ సంచుల కొరత వల్ల కాంటాలు ఆగిపోయాయని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగుల కొరత ఏర్పడి కాంటాలు జాప్యం జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. యాసంగిలో మొగి పురుగుతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొని అరకోరగా పండిన పంటను కేంద్రాలకు తేస్తే అధికారుల నిర్లక్ష్యంతో రోజుల తరబడి రైతులు వేచి చూడాల్సి వస్తుందని మండిపడ్డారు. వానాకాలం సమీపిస్తుందని వెంటనే కొనుగోలు జరపకపోతే వర్షాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. వెంటనే కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను ఏకం చేసి సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తాడూరి రవీందర్, అత్తిని శారద, నాయకులు తేలు ఇస్తారి, నీల బిక్షపతి, ఆరుట్ల రవి, తాడూరి మల్లేశం, వుల్లంపల్లి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన జిందం మల్లేశం గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. నర్సాయపల్లి యూత్ అసోసియేషన్. ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి రూ.23 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో కూడా మృతుని కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల పరిధిలోని శభాష్ గూడెం గ్రామంలో గ్రామానికి చెందిన రాజుపేట స్వామి బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఫోన్ ద్వారా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంపిన రూ.5 వేలను చేర్యాల ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొడ్డు స్వప్న, గుద్దేటి కనకయ్య, గజ్జి కనకయ్య, శ్రీరాముల కనకయ్య, మడిపడిగె భాస్కర్, జెరిపోతుల నర్సింహులు, రజంగరి ప్రభాకర్, మల్లిగారి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వామి కుటుంబానికి అండగా ఉంటాం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డుకు చెందిన పశువుల స్వామి మృతి చెందడం బాధాకరమని ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కౌన్సిలర్ గంగిశెట్టి చందన రవీందర్‌తో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలన్నారు. ఆ కుటుంబానికి తగిన ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో అన్ని విధాల ఆదుకునేందుకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు స్వామి చారి, శేఖర్ ఉన్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం

నవతెలంగాణ-గజ్వేల్



పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు విజయం ఖాయమని గజ్వేల్ మండల కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ మహేష్ అన్నారు. బుధవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు నాయకులు ఎంతో కష్టపడ్డారని ఆయన అన్నారు. కొడకండ్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ వచ్చే అవకాశం ఉందన్నారు. స్థానిక నాయకుల సహకారంతో నీలం మధు కోసం ప్రచారం నిర్వహించామని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మధు గెలిస్తే గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి మరింతగా జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కృషితో గజ్వేల్‌లో పార్టీ బలోపేతం అవుతుందని, చేరికల వల్ల పార్టీ అభ్యర్థికి ఓటింగ్ పెరిగే అవకాశం ఉందన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మున్సిపాలిటీలోని 11వ వార్డు చెందిన పసుల స్వామి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు గాడిపల్లి అనూప్, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆర్థిక సహాయాన్ని అందించారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌ల దృష్టికి ఈ విషయాన్ని పోయి ప్రభుత్వ పరంగా స్వామి కుటుంబాన్ని ఆదుకునేలా చూస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను ఆదుకుంటుందన్నారు.

దాతల సాయం కోసం సాయిచరణ్ ఎదురుచూపు

- **క్యాన్సర్ చికిత్సకు సహాయం అందించాలని అర్థిస్తున్న సాయి చరణ్ కుటుంబ సభ్యులు**



నవతెలంగాణ-సిద్దిపేట

తన జీవితాన్ని దాతల సహాయంతో కొనసాగించాలనుకుంటున్నాడు. దాతలు సహకరిస్తే తన ఇద్దరు చిన్నారులతో జీవితం గడపాలనుకుంటున్నాడు. కోటి మందిలో ఒకరికి వచ్చే అరుదైన క్యాన్సర్‌తో బాధపడుతున్న సాయి చరణ్. ఉన్న ఇల్లు అమ్ముకొని చికిత్స చేయించుకుంటున్నా, వచ్చిన మాయ రోగాన్ని నయం చేసుకోవడానికి డబ్బులు సరిపోక దాతల కోసం ఎదురు చూస్తున్నాడు సాయిచరణ్ తండ్రి రాము. సిద్దిపేటకు చెందిన సిరిసిల్ల రాము, సునీతల దంపతులకు కుమారుడు సాయిచరణ్ (35). ఓ ప్రైవేటు కళాశాలలో పనిచేస్తున్న సాయి చరణ్‌కు భార్య లక్ష్మీప్రసన్న, కుమా ర్తెలు లక్ష్మిసుసజ్ఞ (6), స్మయ (2నెలలు) ఉన్నారు. జీవితం సాఫీగా కొనసాగుతుందన్న సమయంలో సాయి చరణ్‌కు నాలుగు నెలల క్రితం తీవ్రమైన జ్వరం రావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. కానీ జ్వరం తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. అక్కడ వైద్యులు చేసిన వైద్య పరీక్షల్లో అక్యూర్డ్ మైలాయిడ్ లుకేమియా (బ్లడ్ క్యాన్సర్)తో బాధపడుతున్నట్టు తేలింది. కోటి మందిలో ఒకరికి వచ్చే ఈ క్యాన్సర్ ప్రాణాంతకమని, వెంటనే చికిత్స ప్రారంభించాలని వైద్యులు సూచించారు. సిద్దిపేట శివారులో ఉన్న ఎన్సాన్పల్లి గ్రామంలోని తన ఇంటిని తండ్రి రాము రూ. 18 లక్షలకు అమ్మి సాయి చరణ్‌కు చికిత్స చేయించారు. హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో నాలుగు నెలలుగా కీమోథెరపీ చేయించుకున్న సాయిచరణ్ మరో రెండ్రోజుల్లో స్టెమ్సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియలో భాగంగా తండ్రి రాము రక్తమూలకణాలను సాయిచరణ్‌కు ఎక్కిస్తారు. ఈ చికిత్స ద్వారా ఏడాదిన్నరలోగా సాయిచరణ్‌కు ఉన్న వ్యాధి 90 శాతం తగ్గే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. అయితే, ఈ చికిత్సకు రూ.25 లక్షలు అవసరం అవుతాయని తెలిపారు. వెల్డింగ్ దుకాణంలో పని చేసే రాము ప్రస్తుతం అన్నీ తానై కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు చిన్నారుల తండ్రైన సాయిచరణ్‌కు సాయం చేయాలనుకునే దాతలు 92955 55855 నెంబరుకు ఫోన్‌పే ద్వారా డబ్బు పంపించాలని లేదా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు లోని సిరిసిల్ల సాయిచరణ్ ఖాతా (239901000004002, ఐఎఫ్ఎస్ సీ కోడ్ ఐఓబీఏ0002399)లో నగదు జమచేయాలని వేడుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే హరీశ్ రావు, రాష్ట్ర ప్రభుత్వం తనకు సహాయం చేసి తనకు జీవితాన్ని ప్రసాదించాలని వేడుకుంటున్నాడు సాయికిరణ్.

బాల్యంలోనే నచ్చిన అంశాన్ని ఎంపిక చేసుకొని శిక్షణతో ఎదగాలి

- **తెలుగు సినిమా హీరో సంపూర్ణేష్ బాబు**
- **ఘనంగా వ్యాస మహర్షి యోగా సొసైటీ వేసవి శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవం**



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట అన్ని రంగాల్లో పురోగమించడం హర్షణీయమని, బాల్యంలోనే నచ్చిన అంశాన్ని ఎంపిక చేసుకొని శిక్షణ, సాధనలతో రాటు తేలితే జాతీయస్థాయిలో గుర్తింపు పొందడానికి అవకాశం ఉంటుందని తెలుగు సినిమా హీరో సంపూర్ణేష్ బాబు అన్నారు. సిద్దిపేట వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవం బుధవారం విపంచి కళా నిలయంలో కన్నుల పండుగగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చప్పట్లను కురిపించాయి. నైతిక విలువలు, భగవద్గీత శ్లోకాలు, అబాకస్, కర్ర సాము, చిత్రలేఖనం, చేతిరాత, నీతి కథలు, నృత్యం తదితర అంశాల్లో శిక్షణ పొందిన పిల్లలు తమ అద్భుత ప్రదర్శనలతో ఆహుతులను అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని చూస్తుంటే రవీంద్ర భారతిలో ఉన్నామా అని అనిపిస్తుందన్నారు. పిల్లలలో ఎంతో శక్తి దాగి ఉంటుందని, దానిని గుర్తించి వెలికి తీయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులదన్నారు. వాళ్లకు ఇష్టమైన రంగాల్లో మనం శిక్షణ ఇవ్వాలన్నారు. విశిష్ట అతిథి సినిమా నటులు సిల్వర్ సురేష్ మాట్లాడుతూ సృజనాత్మక రంగాల్లో మెరవడానికి ఇప్పుడు ఎన్నో అవకాశాలు ఉంటున్నాయన్నారు. సినిమా, టీవీ, ఓటీటీల ద్వారా నటీనటులకు, సాంకేతిక నిపుణులకు అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. సిద్దిపేటలో నటనలో శిక్షణ ఇవ్వడానికి అంగీకరించారన్నారు. ప్రముఖ జర్నలిస్టులు దేవిక రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులకు మన సంస్కృతి, సాంప్రదాయాలను కూడా నేర్పాలన్నారు. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఇలాంటి బాల సంస్కార్ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. చదువుతోపాటు ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని, అందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జర్నలిస్ట్ అంజయ్య , సిద్దిపేట జిల్లా టీఎన్జీవోల సంఘం అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు పరమేశ్వర్, విక్రం రెడ్డి, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి , యుటిఎంఎ రాష్ట్ర అధ్యక్షులు లక్కిరెడ్డి విజయరెడ్డి, బాల సంస్కార్ కోర్స్ డైరెక్టర్ తోట సంధ్య , ప్రముఖ యోగా శిక్షకులు తోట సతీష్ లు మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి సిద్దిపేటలో వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరానికి అనూహ్య స్పందన లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బాల సంస్కార్ పేరిట నిర్వహిస్తున్న ఈ శిక్షణ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు హారతి పడుతుందని కొనియాడారు. విద్యార్థులు మార్కుల వేటలో ఆటలకు, పాటలకు దూరం కావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను నిర్వాహకులు సన్మానించారు. శిక్షణ తీసుకున్న చిన్నారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ చిప్ప ప్రభాకర్, యోగాసోసియేషన్ సభ్యులు గంగాపురం శ్రీనివాస్, రాజ్ కుమార్, రవి, అనిల్, సురేష్, మనీషా, సింధూరి, విజయలక్ష్మి, డాన్స్ మాస్టర్ రాజేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన జిల్లా సంక్షేమ అధికారి

- **జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్, జిల్లా కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి**



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

పదవి విరమణ పొందిన జిల్లా సంక్షేమ అధికారి కే. సావిత్రికి బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారుల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్లు గరీమ అగ్రవాల్, శ్రీనివాస్ రెడ్డిలు జిల్లా అధికారులతో కలిసి పదవి విరమణ పొందిన జిల్లా సంక్షేమ అధికారి కే. సావిత్రిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ డిడబ్లుఓ సావిత్రి జిల్లాలో 2 నెలలు మాత్రమే పనిచేసినా నిబద్ధతతో పని చేసి అందరి మన్ననలు పొందారన్నారు. తన జీవితంలో అధికభాగం ఆసిఫాబాద్, ములుగు, ఖమ్మం లాంటి ఆదివాసీ జిల్లాల్లో పని చేసి పేద ప్రజలకు సేవలందించారన్నారు. పదవీ విరమణ ఉద్యోగ జీవితంలో సర్వ సాధారణం కాబట్టి పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. పదవీ విరమణ పొందిన జిల్లా సంక్షేమ అధికారి కే. సావిత్రి మాట్లాడుతూ జిల్లాలో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు పూర్తి సహకారం అందించారని జిల్లా అధికారుల సమక్షంలో పదవీవిరమణ పొందడం తన అదృష్టమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు డీఆర్‌డీఓ జయదేవ్, డిబిసి సిఓ సరోజ, డిపిఓ దేవకీదేవి, డిఎస్‌లసి డిఓ కవిత, డిపిఆర్ఓ రవికుమార్, ఏడి సర్వే వినయ్, ఏడి మార్కెటింగ్ నాగరాజు, డిఎంసి ఎస్ హరీష్, పశు సంవర్ధక, హార్టికల్చర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, ఇన్చార్జి డిడబ్ల్యూఓ శారద, సిడిపివోలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్త పై దాడికి పాల్పడటం హేయమైన చర్య

నవతెలంగాణ-మర్కుక్

బీజేపీ కార్యకర్తపై దాడికి పాల్పడటం బీఆర్ఎస్ నాయకుల అవివేకానికి నిదర్శనమని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని పాములపర్తి గ్రామంలో బీజేపీ కార్యకర్తపై బీఆర్ఎస్ నాయకుల చేతిలో దాడికి గురైన ఉప్పరి మురళిని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి ఓడిపోతారనే భయంతో మర్కుక్ ఎంపీపీ పాండుగౌడ్ తన సొంత గ్రామంలో బీఆర్ఎస్‌కు ఓట్లు పడకపోతే తన పరువు పోతుందని కారణంతోనే దాడులు చేయించారని విమర్శించారు. రాజకీయాలు చేయాలి తప్ప వ్యక్తిగత దాడులు చేయడం సరికాదన్నారు. దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించేంతవరకు ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. బీజేపీ కార్యకర్తలు ఎవరు కూడా అధైర్య పడోద్దని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపొందేది, బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు అని ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం బీజేపీ కార్యకర్తలతో మర్కుక్ పోలీస్ స్టేషనకు వెళ్లి దాడికి పాల్పడ్డ వ్యక్తుల మీద కచ్చితంగా కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎల్లు రామిరెడ్డి, గజ్వేల్ అసెంబ్లీ కో కన్వీనర్ బండారు మహేష్, మర్కుక్ మండల పార్టీ అధ్యక్షులు సాయిరెడ్డి రాం రెడ్డి , యువ మోర్చా జిల్లా అధ్యక్షులు నీలం దినేష్, మర్కుక్ మండల ఉపాధ్యక్షులు మహేష్ గౌడ్, రాజేందర్ సింగ్, మురళి, రాజు తదితరులున్నారు.



వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గో సేవ



నవ తెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కాసనగోట్టు స్వరూప శ్రావణ్ కుమార్‌ల దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా వైశ్య భవన్ గోశాలలో గోవులకు ఆహారం అందించినట్లు జోన్ చైర్మన్ చింత రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు చకిలం రవి, సెక్రటరీ విశ్వం, పి ఆర్వో దుర్గయ్య, గట్టు రవి, శ్రీనివాస్, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్ 1 (ప్రిలిమ్స్) ఎగ్జామినేషన్

- **బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్. పి. కృష్ణ దయాసాగర్**

నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న బీసీ స్టడీ సర్కిల్ లో గ్రూప్స్ 1 (ప్రిలిమ్స్) ఎగ్జామినేషన్ 2024 ఆఫ్‌లైన్‌లో గ్రాండ్ టెస్టులను సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్లో నిర్వహిస్తున్నామని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్. పి. కృష్ణ దయాసాగర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టిఎస్పిఎస్సి గ్రూప్ 1 అభ్యర్థులకు ఈ నెల 18, 20, 22, 25, 27, 29, 31, జూన్ 1, 3న అభ్యర్థులకు ఆఫ్ లైన్ పద్ధతిలో బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ 2024 అభ్యర్థులకు కూడా గ్రాండ్ టెస్ట్‌లు ఆఫ్‌లైన్ ద్వారా టి.ఎస్. బి.సి. స్టడీ సర్కిల్ సైదాబాద్, హైదరాబాద్‌లో నిర్వహించనున్నామన్నారు. ఈనెల 23, 26, 28, 30, జూన్ 2, 4, 6, 8, 10, 12న నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రాండ్ టెస్టులకు హాజరు కావడానికి అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత పూర్తి సమాచారం కొరకు 9966673095, 08457-224941 నెంబర్‌లను సంప్రదించాలని సూచించారు.